# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 167 | పేజీలు : 08 | గురువారం | 25-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## షరతులతో బెయిల్

**బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట..**

- ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని ఆదేశం
- మే 30న అరెస్ట్ అయిన సుమన్‌కు ఇరవై ఐదు రోజుల తర్వాత బెయిల్
- జైలు నుంచి విడుదల కానున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సింగరేణి అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న కేసులో ఆయనకు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఇద్దరు వ్యక్తుల

## నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!



- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

2

**'ఎస్ఐఆర్'పై సీఎం ఫోకస్..**

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని

## 1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

- హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా
- ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో చెరువు కబ్జా యత్నం భగ్నం
- కబ్జాలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా ఏజెన్సీ
- అక్రమ కట్టడాలు కూల్చివేసి ఫెన్సింగ్ ఏర్పాటు
- రెండేళ్లలో లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడిన హైడ్రా



## రాహుల్ ప్రధాని అయితేనే ఈసీ కంట్రోల్‌లో ఉంటుంది

- అప్పటిదాకా ఓట్ల పంచాయితీలు సాగుతూనే ఉంటాయి.. ప్రస్తుతం మోదీ ఏం చెబితే ఎన్నికల కమిషన్ అదే చేస్తోంది
- 543 ఎంపీల్లో 300 కాంగ్రెస్ గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారు
- వచ్చే సారి మెదక్ పార్లమెంట్ స్థానంలోనూ కాంగ్రెస్సే గెలవాలి
- ఎక్కువ స్థానాల్లో గెలిస్తేనే మోదీ పాలనకు తెర: తూర్పు జగ్గారెడ్డి

2



### కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్.. ఫ్యామిలీకి హాయ్, హార్ట్ సింబల్!



హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఒక అధికారిక కార్యక్రమాన్ని తనదైన శైలిలో ఎంతో ఉత్సాహంగా,

## 'సర్'తో జాగ్రత్త.. లేదంటే పౌరసత్వానికే ఎసరు!

- అందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందే
- లేకుంటే బిహార్, బెంగాల్ తరహాలో ప్రమాదం
- తెలంగాణకు కేసీఆర్ కుటుంబమే ప్రమాదకరం
- ఖమ్మం జిల్లా వైరాలో డిప్యూటీ సీఎం భట్టి



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

వైరా: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్- సర్) విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. అజాగ్రత్తగా ఉంటే పౌరసత్వానికే ఎసరు వస్తుందని హెచ్చరించారు. బిహార్, బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ సర్‌తో ప్రమాదం పొంచి ఉందని అన్నారు. అందుకే ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాంద్ష?సనాయక్

**ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం.. స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!** 2

## దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుంది

2

**జొన్నగిరిలో సీఎం చంద్రబాబు**



- కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం
- జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- రాబోయే రోజుల్లో స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ 5000 మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని హామీ
- రాయలసీమను 'రత్నాల సీమ'గా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వంపై, గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన చంద్రబాబు

హైదరాబాద్ పల్స్,డెస్క్

రాయలసీమ చరిత్రలో ఒక సరికొత్త సువర్ణాధ్యాయం ప్రారంభమైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ చారిత్రక సందర్భంలో జొన్నగిరి పేరును

## తెలంగాణలో హిట్లర్ పాలన

**ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్**

- తెలంగాణలో హిట్లర్ తరహా పాలన సాగుతోందన్న హరీశ్ రావు
- ఖమ్మంలో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందని ఆరోపణ
- మంత్రి పొంగులేటి ల్యాండ్ గ్రాబర్‌గా మారారంటూ తీవ్ర విమర్శ
- రైతు ఆశీర్వాద సభను క్షమాపణ సభగా మార్చాలని డిమాండ్

2



## హైకోర్టులో ఊరట...

2

**సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట... ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత**



- 2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్
- 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలపై విచారణ
- కేసుల కొట్టివేతతో రేవంత్‌కు ముగిసిన న్యాయపరమైన చిక్కులు

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి

# షరతులతో బెయిల్

మొదటి పేజీ తరువాయి

పూచీకత్తును సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా రిమాండ్‌లో ఉన్న సుమన్‌కు ఊరట లభించినట్లయింది.కేసు నేపథ్యం పరిశీలిస్తే, గత మే 26న జరిగిన పార్టీ సమావేశంలో బాల్క సుమన్, నాంపల్లిలోని సింగరేణి భవన్, మందమర్రిలోని జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయని పేర్కొంటూ సింగరేణి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, మే 30న తెలంగాణ భవన్‌లో సుమన్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలులో సుమన్‌ను పరామర్శించి, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు.

# తెలంగాణలో హిట్లర్ పాలన

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రైతుబంధు చెల్లింపులు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. గత కొంతకాలంగా రెవెన్యూ మంత్రికి వ్యతిరేకంగా భూ, మైనింగ్ సమస్యలపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# రాహుల్ ప్రధాని అయితేనే ఈసీ కంట్రోల్‌లో ఉంటుంది

మొదటి పేజీ తరువాయి

'రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఎన్నికల కమిషన్ కంట్రోల్‌లో ఉంటుంది. అప్పటిదాకా ఈ ఓట్ల పంచాయతీలు ఇలాగే ఉంటాయి.. ఎందుకంటే ప్రధాని మోదీ ఏం చెబితే ఎన్నికల కమిషన్ అదే చేస్తోంది. అందుకే కొన్ని రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపు తర్వాత బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయి' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ జూమ్ మీటింగ్‌లో చేసిన సూచనల మేరకు సంగారెడ్డిలో బుధవారం సాయంత్రం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఏఆర్‌పై కాంగట?స్రకు చెందిన బూత్‌లెవల్ ఏజెంట్లు, పార్టీ ముఖ్యనేతలకు జగ్గారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఓట్ల సవరణ కుట్రపై రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో కొట్లాడుతున్నారని చెప్పారు. రాహుల్ ప్రధాని కావాలంటే మనమందరం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 543 ఎంపీ స్థానాలకుగాను 300 చోట్ల కాంగ్రెస్ గెలవాలని, అందులో మెదక్ పార్లమెంటు కూడా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఓట్లను తొలగించడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను బీఎల్ఏలు అడ్డుకోవాలని సూచించారు. ఎక్కువ స్థానాల్లో గెలవడం ద్వారానే దుర్మార్గమైన మోదీ పాలనకు తెర పడుతుందని అన్నారు.

# హైకోర్టులో ఊరట...

మొదటి పేజీ తరువాయి

ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు.ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.

# నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు.బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# 'సర్'తో జాగ్రత్త..

## లేదంటే పౌరసత్వానికే ఎసరు!

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షతన బీఎల్ఏలు, కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా నమోదు, సవరణలు, మ్యాపింగ్ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బిహార్, పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఒక్కో నియోజకవర్గంలో 30-40 వేల ఓట్లను తొలగించడంతో అక్కడ అభ్యర్థుల తలరాతలు తారుమారయ్యాయని గుర్తుచేశారు. సర్‌తో తన ఓటును కూడా కోల్పోయే ప్రమాదం లేకపోలేదని భట్టి అన్నారు. 2002లోని ఓటర్ లిస్టులో మల్లు భట్టి విక్రమార్క అని, 2025 లిస్టులో విక్రమార్క మల్లు అని ఉంటే దాన్ని ఆసరా చేసుకొని తన ఓటును తొలగించే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల మ్యాపింగ్ చేసిన ఓటర్లు కూడా తుది జాబితా వచ్చేవరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. తెలంగాణకు కేసీఆర్ కుటుంబమే అత్యంత ప్రమాదకరమని భట్టి ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు గాలివార్తలతో ప్రజలను మభ్యపెట్టేందుకు మళ్లీ రాష్ట్రంమీద పడి తిరుగుతున్నారని భట్టి ధ్వజమెత్తారు.

రూ.9 వేల కోట్ల భరోసా నిధులు: తుమ్మల

ఈ నెల 30న ఖమ్మం జిల్లాలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. డిప్యూటీ సీఎం చొరవతో చింతకాని మండలంలో రైతు ఆశీర్వాద సభ జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా వానాకాలం రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను విడుదల చేయబోతున్నామని వెల్లడించారు. దేశం మొత్తంమీద కేంద్రం 70 లక్షల టన్నుల పంటలను కొనుగోలు చేస్తే ఒక్క తెలంగాణ నుంచి కొనుగోలు చేసిన పంటలే 55 లక్షల టన్నులని వివరించారు.

# కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్..

## ఫ్యామిలీకి హాయ్, హార్ట్ సింబల్!

మొదటి పేజీ తరువాయి

చిరస్మరణీయంగా మార్చారు. బుధవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో 'ట్యాంజెడ్‌కో' (విద్యుత్ బోర్డు)కు కొత్తగా ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు కోరిన సరదా విన్నపాలను ఆయన మన్నించి అక్కడి వారందరినీ ఆకట్టుకున్నారు.తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రాష్ట్ర విద్యుత్ శాఖకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి విజయ్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఒక నూతన ఉద్యోగి తన కుటుంబ సభ్యులకు 'హాయ్' చెప్పాలని కోరగా, విజయ్ చిరునవ్వుతూ కెమెరా వైపు చూసి అభివాదం చేశారు.మరొక అభ్యర్థి 'హార్ట్ సింబల్' చూపించమని కోరగా, ఆయన ఆ విన్నపాన్ని కూడా తీర్చారు. దీంతో సభ ప్రాంగణమంతా చప్పట్లు, కేరింతలతో సందడిగా మారింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం..

## స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది.ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హద్‌లో ఖననం చేయనున్నారు. తెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# 1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ శివార్లలోని ఐటీ కారిడార్‌లో భారీ కబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) భగ్నం చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో దాదాపు రూ.1,000 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. ఈ స్థలంలో నిర్మించిన తాత్కాలిక షెడ్లు, గదిని కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ విలువైన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేస్తుండగా రెవెన్యూ శాఖ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, అక్రమ నిర్మాణాలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసింది.మరోవైపు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువు కబ్జాను కూడా హైడ్రా అడ్డుకుంది. పట్టా భూమిలో ఆర్ఎంసీ యూనిట్ ఏర్పాటు చేసిన ఓ వ్యక్తి, వ్యర్థాలను చెరువులోకి డంప్ చేస్తూ సుమారు ఐదెకరాల చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు దర్యాప్తు చేసి, చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్) పరిధిలో కార్మికుల కోసం నిర్మించిన షెడ్లను తొలగించారు. చెరువులోకి వేసిన మట్టిని వెంటనే తొలగించాలని కబ్జాదారుడిని హైడ్రా ఆదేశించింది.కాగా, గత రెండేళ్లలో హైడ్రా ఏజెన్సీ రూ.1.10 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ చెరువులు, నాలాలు, పార్కులు, భూములను కబ్జాల నుంచి కాపాడినట్లు ఈ నెల ప్రారంభంలో వెల్లడించింది. వచ్చే ఏడాది నాటికి రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తుల పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

# దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుంది

మొదటి పేజీ తరువాయి

'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సహచర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, భరత్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జియో మైసూర్ సంస్థ ప్రతినిధులు, త్రివేణి ఎర్త్‌మూవర్స్ ఎండీ ప్రభాకరన్ హాజరయ్యారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, 'రత్నాల సీమ'గా మారుతుందన్న ఆశాభావాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

రాయలసీమలో సరికొత్త సువర్ణాధ్యాయం

దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును జొన్నగిరిలో ప్రారంభించడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు విస్తరణ యూనిట్‌కు కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. జియో మైసూర్ సర్వీసెస్, త్రివేణి ఎర్త్‌మూవర్స్ సంస్థలను ఆయన అభినందించారు. "ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ద్వారా 400 కేజీల బంగారం ఉత్పత్తి ప్రారంభమైంది. ఇది త్వరలోనే 1000 కిలోలకు (ఒక టన్ను) చేరుకుంటుంది. రెండో యూనిట్ కూడా పూర్తయితే ఇక్కడి నుంచే 50 మెట్రిక్ టన్నుల బంగారం ఉత్పత్తి చేయబోతున్నాం. ఇది ఒక చరిత్ర" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని, త్వరలోనే ఈ సంఖ్య 1500కు, భవిష్యత్తులో 5000కు చేరుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

జొన్నగిరి కాదు.. ఇకపై స్వర్ణగిరి

ఈ ప్రాంతానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, అశోకుడి కాలంలో దీనిని 'సువర్ణగిరి' అని పిలిచేవారని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రజల ఆమోదంతో జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. "ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 గురించి కలలు కంటున్నారు. నా ఆలోచన వికసిత్ భారత్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడం. దానికి ఈరోజే ఇక్కడ నాంది పలుకుతున్నాం" అని చంద్రబాబు అన్నారు. స్వర్ణగిరి గ్రామాన్ని దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని త్రివేణి ఎండీ ప్రభాకరన్‌ను కోరగా, ఆయన అంగీకరించారని తెలిపారు.

ఇక దేశమంతా స్వర్ణగిరి వైపే చూస్తుంది

ఒకప్పుడు దేశంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్) గురించి మాట్లాడుకునేవారని, ఇకపై దేశమంతా 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుకుంటుందని చంద్రబాబు అన్నారు. "ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించింది మన రాష్ట్రమే. ఇప్పుడు దేశం ఏటా 80,800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులను తగ్గించడంలో స్వర్ణగిరి కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇక్కడే ఒక బృహత్తరమైన జువెలరీ పార్క్ ఏర్పాటు చేసి, ప్రపంచానికి కావాల్సిన ఆభరణాలు స్వర్ణగిరి నుంచే సరఫరా అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు.

రత్నాల సీమగా రాయలసీమ.. ఇదే మా విజన్

రాయలసీమ అంటే రాళ్ల సీమ కాదని, రత్నాల సీమగా మార్చి చూపిస్తానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్ జెట్లు తయారవుతాయి. అనంతపురంలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ హబ్‌లు వస్తున్నాయి. కియా మోటార్స్, సిమెంట్, స్టీల్ పరిశ్రమలతో పాటు సోలార్, విండ్ ఎనర్జీకి రాయలసీమ కేంద్రంగా మారుతుంది," అని భరోసా ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని, 2028 నాటికి కడపలో స్టీల్ ప్లాంట్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు

ఈ సందర్భంగా వైసీపీపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గత ప్రభుత్వం వాటాల కోసం, అక్రమ సంపాదన కోసం పరిశ్రమలను వేధించి తరిమేసింది. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు. గొడ్డలి పార్టీకి విధ్వంసమే విజన్, ఫేక్ ప్రచారమే విధానం, రప్పాడించే రాజకీయాలే మేనిఫెస్టో" అని దుయ్యబట్టారు. బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ నేరాన్ని తనపై వేయడానికి ప్రయత్నించారని, అలాంటి ప్రమాదకరమైన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని, దేవుడి విషయంలో అపచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇస్తే, దానిపై కూడా కుట్రలు చేసి పేపర్ లీక్ అయిందని ఫేక్ ప్రచారం చేశారని మండిపడ్డారు. డీఎస్సీ పరీక్ష జరిగిన ఏడాది తర్వాత పేపర్ లీక్ అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తుంటే, గొడ్డలి పార్టీ కులం, మతం, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తోందని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని, త్వరలోనే ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజల ముందు ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# అక్రమంగా తొలగించిన బిస్లరీ కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె ఆగదు

**కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్న బిస్లరీ యాజమాన్యం**

**పరిశ్రమ యాజమాన్యాలు నిరంకుశంగా వ్యవహరిస్తే కార్మికుల తిరుగుబాటులు తప్పవు**

**సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24:** అక్రమంగా తొలగించిన బిస్లరీ కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె ఆగదని, పరిశ్రమ యాజమాన్యాలు నిరంకుశంగా వ్యవహరిస్తే కార్మికుల తిరుగుబాటులు తప్పవు అని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, బిస్లరీ యూనియన్ అధ్యక్షులు అతిమేల మానిక్ హెచ్చరించారు. ఐడిఏ పాశమైలారంలోని బిస్లరీ పరిశ్రమ కార్మికుల సమ్మెలో భాగంగా ఇస్నాపూర్ చౌరస్తా వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి వినతి పత్రం అందజేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ బిస్లరీ యాజమాన్యంకు కార్మికుల హక్కులంటే లెక్క లేదా అని అన్నారు. బిస్లరీ యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందని అన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులను యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తుందని అన్నారు. బౌసర్లను పెట్టి కంపెనీని ఎన్ని రోజులు నడిపిస్తాడని అన్నారు గత 15 సంవత్సరాలుగా కంపెనీ కోసం శ్రమించిన కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా సమ్మెపై నిర్బంధం ప్రయోగిస్తుందని అన్నారు. తొలగించిన బిస్లరీ కార్మికులను డ్యూటీలోకి తీసుకునే వరకు సమ్మె పోరాటం ఆగదని సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.. కార్మికుల హక్కులను కాలరాస్తూ చట్టానికి విరుద్ధంగా యాజమాన్యాలు వ్యవహరిస్తే కార్మికుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని నోయిడా కార్మికుల పోరాటం చూసి అయినా యాజమాన్యాలు గుణపాఠం తీసుకోవాలని



అన్నారు. పోరాటం యూనియన్ గుర్తించాలని వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విచ్ఛిన్నానికి యాజమాన్యం చేస్తున్న కుట్రలను కార్మికులు ఐక్యంగా తిప్పి కొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజు బిస్లరీ యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి నాయకులు నాగరాజు ప్రవీణ్ గౌడ్ సతీష్ గౌడ్ కృష్ణ కుమార్ అజయ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువు

**ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ త్రాగినీటి సౌకర్యం లేక ఇబ్బందులు**

**ప్రభుత్వ పాఠశాలలో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, నారాయణ ఖేడ్ :**

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం నర్సింలు మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణ కేంద్రంలో బాలురు బాలికల పాఠశాలలో సందర్శించడంతో విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య కనుక్కునంగా టాయిలెట్లు బాత్రూంలో లేక ఇబ్బందులు పడుతున్నారని బాలుర పాఠశాలలో వర్షాకాలంలో కూడా జీవన్ ఫంక్షన్ హాల్ వరకు టాయిలెట్ కు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే పాఠశాలలో త్రాగు నీరు రెండు రోజులకు ఒకసారి రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఇంటి నుండి తెచ్చుకుంటున్నారని అన్నారు. అలాగే బాలికల పాఠశాల 800 మంది విద్యార్థులు ఉంటే సరిపడా టాయిలెట్లు నీటి సౌకర్యం లేక దుర్వాసన వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే టాయిలెట్లు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుంది కొంతమంది అకౌంటెంట్ రికార్డ్ అసిస్టెంట్ డిప్టేషన్ మీద డి వో ఆఫీస్ లో పనిచేస్తూ జీతం నారాయణఖేడ్ హైస్కూల్లో తీసుకుంటున్నారు నైట్ వాచ్మేన్ పోస్ట్ భర్తీ చేయాలని



అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు గొప్పలు చెప్పడం ఆపి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని లేనియెడల ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి రమేష్ రాంలాల్ మైపాల్ దినకర్ తదితరులు ఉన్నారు.

# రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు....

**వైభవంగా శ్రీనివాసుని తిరు:కళ్యాణ మహోత్సవం...**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలోని కోరిన కోరికలు తీర్చే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవముగా కొనసాగుతున్నాయి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాస్ ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీమాన్ చక్రవర్తుల అళహాసింగారా చార్యులు నేతృత్వములో యజ్ఞ ఋత్వికుల వేద మంత్రోచరనాలతో తిరు:కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా సన్నాయి మేళ తాళాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో రఘునాథపురంతో పాటు హైదరాబాద్ నుండి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు కళ్యాణం అనంతరం శ్రీ వెంకటేశ్వర భజన మండలి భక్త బృందంచే అన్న సంతర్పణ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవానికి ధన వస్తురూపమైన సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు, కళ్యాణ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వారికి ఆలయ కమిటీ చైర్మన్ చింతకింది రామదాసు, ఉత్సవ కమిటీ చైర్మన్ రాచకొండ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చేసిన ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, ఆలయ ప్రాంగణం అంతా భక్తి పరవశంతో భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ



మహోత్సవం కనులారా తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు తరించారు అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను స్వీకరించి శ్రీ స్వామివారి అనుగ్రహం పొందారు సాయంత్రం శ్రీ వెంకటేశ్వర భజన మండలి భక్త బృందంచే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవం రఘునాథ పురవీధులలో అత్యంత వైభవంగా భక్తుల గోవింద నామస్మరణతో మహిళల కోలాట భజనలతో రఘునాథపురవీధులలో గరుడ వాహనంపై గ్రామోత్సవం ఊరేగింపు కార్యక్రమం కనుల పండుగగా జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రముఖులు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కంటోన్మెంట్ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలి : శ్రీ గణేష్

## కంటోన్మెంట్ క్రీడాకారులను అభినందించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే

సికింద్రాబాద్, జూన్ 24,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
చాదర్ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ఈ నెల 21న జరిగిన జూనియర్,సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి 12 బంగారు పతకాలు, 2 వెండి పతకాలను సాధించిన కంటోన్మెంట్ క్రీడాకారులు బుధవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ను తన నివాసంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ పతక విజేతలను, వారి కోచ్‌లను మనసారా అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, మీరు మరింత కష్టపడి సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కంటోన్మెంట్ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని, మీ కలల సాకారానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని క్రీడాకారులకు కావాల్సిన ప్రత్యేక సహాయ సహకారాలన్నీ ప్రభుత్వం తరపున అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడలను ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా యువజన, క్రీడల అధికారి నందకిషోర్ గోకుల్, కోచ్ హేమలత, పతక విజేతలైన క్రీడాకారులు పాల్గొన్నారు.





# శివానగర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించిన : ఎమ్మెల్యే జిఎంఆర్






**జిన్నారం, హైదరాబాద్ పల్స్ న్యూస్ జూన్ 24:**
జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యూలాండ్ పరిశ్రమ సౌజన్యంతో 60 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. ఈ కార్యక్రమానికి హాజరైన జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, న్యూలాండ్ పరిశ్రమ హెచ్ఆర్ డివి రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# రాజపేటలో బిఎల్ఎల సమావేశంలో పాల్గొన్న బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో సర్ కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ... గురువారం నుండి ప్రారంభమయ్యే ఓటు నమోదు కార్యక్రమం సందర్భంగా బిఎల్ఎలు ప్రతి ఒక్కరూ కీలకంగా వ్యవహరించి ప్రతి ఒక్క ఓటును యధావిధిగా ఓటర్ లిస్టులో ఓటు మిస్ కాకుండా నమోదు చేయించే బాధ్యత ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులదే అని తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రజా ప్రతినిధులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో ప్రజా జ్యోతి కార్యాలయం ముట్టడి.!

**ముట్టడించిన వివిధ జిల్లాల జిల్లా ప్రతినిధులు, జర్నలిస్టులు**



హైదరాబాద్, జూన్ 24, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
అక్రిడేషన్ల పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని వందల మంది రిపోర్టర్ల దగ్గర దాదాపు సుమారు రూ.70 లక్షల వరకు డబ్బులు వసూలు చేసిన వీడియోలు బయటకు రావటంతో ఎవరికీ దొరక కుండా తప్పించుకు తిరుగుతున్న ప్రజా జ్యోతి ఎండి శ్రీనివాసరెడ్డి. దీంతో తమకు జరిగిన అన్యాయానికి హైదరాబాదులోని ప్రజా జ్యోతి కార్యాలయాన్ని ముట్టడించిన వివిధ జిల్లాల జిల్లా ప్రతినిధులు అండ్ జర్నలిస్టులు. అదేవిదంగా తమకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాదులోని ఐ అండ్ పీర్ కమిషనర్ని మరియు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలను కలిసి తమకు జరిగిన అన్యాయంను విన్నవించిన బాధిత జర్నలిస్టులు న్యాయం చేసేలా కృషి చేయాలనీ కోరారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

## రాజపేట పశువైద్యాధికారి ఎం.చంద్రారెడ్డి ఆత్మీయ వీడ్కోలు సన్మానం....

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో చల్మెడ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో గతంలో మండల పశువైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ ఎం.చంద్రారెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా హైదరాబాదులోని శాంతినగర్ ప్రాథమిక పశు వైద్యశాలకు బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక పశువైద్యాశాల, రాజపేట ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన సమావేశం జరిగింది ఈ సన్మాన కార్యక్రమంలో ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జానయ్య మాట్లాడుతూ... గత 8 సంవత్సరాలుగా రాజపేట మండలంలో పశువైద్య సేవలు మరియు పశు వైద్య



శిబిరాలు, రైతు అవగాహన సదస్సులు నిర్వహించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల విద్యాధికారి (ఎంఇఓ) చందా రమేశ్, మదర్ డైరీ డైరెక్టర్లు గొల్లపల్లి రామిరెడ్డి మరియు సంధిలా భాస్కర్, మదర్ డైరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, మల్లగూడం సర్పంచ్ జెన్నపల్లి బాలరాజు రెడ్డి, గాండ్ల నర్సింగరావు, మాసిరెడ్డి అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని బాలమని



యాదిగిరి గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిలివేరు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్, సహాయ సంచాలకులు డాక్టర్ రమేష్, డాక్టర్ కే.గోపిరెడ్డి, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ కె.శివరామకృష్ణ, పశు వైద్యులు డాక్టర్ పి.శ్రీకాంత్, డాక్టర్ సునీత, డాక్టర్, డాక్టర్ గిరి నవీన్ రెడ్డి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ ముక్కంటి రాజు, పశువైద్య సిబ్బంది సిద్దులు, రవి, తిప్పర్తి శ్రీకాంత్ గోపాలమిత్రులు ఉదయ్ కుమార్, బాలకిషన్, రామచందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పల్స్ SPECIAL STOTRY

## జేఎన్‌టీయూహెచ్ క్యాంటీన్‌లో కమిషన్ల వ్యవహారమా..?

**కూకట్పల్లి, జూన్ 24, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) ప్రధాన క్యాంపస్‌లో ప్రస్తుతం నిర్వహించబడుతున్న క్యాంటీన్ వ్యవహారంపై విద్యార్థుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎ.జయలక్ష్మి వినతిపత్రం అందజేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రార్, అంశంపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని అలాగే నూతన శాశ్వత క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం క్యాంటీన్ తాత్కాలిక ప్రాతిపదికన నడుస్తున్నప్పటికీ, అది ఏ విధానంలో, ఎవరి అనుమతులతో, ఏ నిబంధనల ప్రకారం కొనసాగుతోందనే విషయాలపై స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. క్యాంటీన్ స్టాల్స్‌లో బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించబడింది. జ్యూస్ స్టాల్‌లో జార్ఖండ్‌కు చెందిన 16 ఏళ్ల పీయూష్, ఫాస్ట్ ఫుడ్ స్టాల్‌లో నేపాల్‌కు చెందిన 17 ఏళ్ల నబిన్, టీ స్టాల్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల సత్యం పనిచేస్తున్నారు. ఈ స్టాల్స్‌ను శ్రీనివాస్ ఆధ్వర్యంలోని శ్రీ శుభకరీ ఫుడ్స్, కేఎన్ఆర్ కాలనీ, నిజాంపేట్ సంస్థ నిర్వహిస్తోంది.

చదువుకునే వయస్సులో డబ్బుల కోసం పని చేయిస్తూ, విద్యాసంస్థ ప్రాంగణంలో బాల కార్మికులను నియమించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి, బాల కార్మిక చట్టాల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయ విద్యార్థులుగా కోరడం జరిగింది. విద్యార్థులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఆహారం అందించాల్సిన క్యాంటీన్‌లో అనేక వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న టీ స్టాల్, ఫాస్ట్ ఫుడ్ స్టాల్, జ్యూస్ సెంటర్ తదితర చోట్ల కూడా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత క్యాంటీన్ నిర్వహణలో ప్రతి నెల వచ్చే ఆదాయంలో 16% చొప్పున 12 సంవత్సరాల నుండి పీహెచ్డీ చేస్తున్న అంబటి సాయి విశ్వజ్ఞ తేజ మరియు ఎస్.పి.ఫ్ అను పేరుతో కేవలం జేఎన్‌టీయూహెచ్ లో ఆర్గనైజేషన్ నడిపిస్తున్న జవ్వాజీ దిలీప్ లకు క్యాంటీన్ మేనేజ్మెంట్ లాభాల్లో వాటాలు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదేవిధంగా క్యాంటీన్ వద్ద

-అధికారిక నేమ్ బోర్డు లేకపోవడం,
-ధరల పట్టిక (మెనూ) ప్రదర్శించకపోవడం,
-సరైన బిల్లింగ్ విధానం లేకపోవడం,
-బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ లేదా పి.ఓ.ఎస్ వ్యవస్థ లేకపోవడం,
-ఫుడ్ సేఫ్టీ, పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం,
-క్యాంటీన్లో చిన్న పిల్లలతో (చైల్డ్ లేబర్) 18 సంవత్సరాల లోపు ఉన్న వారితో పని చేయించుకోవడం వంటి విషయాలు చర్చ నియంశంగా మారాయి.

ఈ క్యాంటీన్‌కు గత రెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి గత రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజనీర్

**టెండర్ లేకుండా తాత్కాలిక నిర్వహణ**

**బాల కార్మికులపై విద్యార్థుల్లో ఆందోళన**

**క్యాంటీన్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, శాశ్వత క్యాంటీన్ కోసం వెంటనే టెండర్ పిలవాలని డిమాండ్**

**చల్ల రామకృష్ణ రెడ్డి, పరిశోధక విద్యార్థి, జేఎన్టీయూ**

శ్రీనివాసులు అనుమతులు మంజూరు చేయగా, ఆ అనుమతులు ఏ ఆధారాలపై జారీ అయ్యాయో, టెండర్ ద్వారా ఇచ్చారా లేక నామినేషన్ పద్ధతిలో ఇచ్చారా అనే విషయాలను యూనివర్సిటీ బహిర్గతం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. క్యాంటీన్‌లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వారికి చెల్లిస్తున్న వేతనాలు, కార్మిక చట్టాల అమలు, బాల కార్మికులు ఉన్నారా లేదా, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు, జి.ఎస్.టీ నమోదు, యూనివర్సిటీకి చెల్లిస్తున్న అద్దె లేదా ఫీజుల వివరాలను కూడా బహిర్గతం చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత క్యాంటీన్ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అన్ని వివరాలను ప్రజల ముందుంచి, పారదర్శక టెండర్ ప్రక్రియ ద్వారా శాశ్వత క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థి లోకం కోరుతోంది. జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, పారదర్శక నిర్వహణ, అందుబాటు ధరలు కల్పించడం యూనివర్సిటీ బాధ్యత అని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయరాం, సాయిరాం, విశ్వజిత్, మనీష్, రామ్, శ్రీను, హర్ష, సంపత్, విక్రమ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం.. డెయిరీ యాజమాన్యం పనిచేస్తున్నాయి....

**డెయిరీ అభివృద్ధి చెందితే రైతులకు మంచి ధరలతో పాటు బోనస్‌లు....**

**ప్రతి లీటరుకు అదనంగా ఒక రూపాయి బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.....**


**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి మదర్ డైయిరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మీడియా సమావేశంలో బీర్ల ఐలయ్య మాట్లాడారు... రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మరియు డెయిరీ యాజమాన్యం పనిచేస్తున్నాయి. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోయడం కంటే రైతుల సొంత డెయిరీలకు పాలు పోస్తే వచ్చే లాభాలు తిరిగి రైతులకే చేరుతాయి. అందుకే రైతులు తమ డెయిరీలను బలోపేతం చేయాలని కోరుతున్నాము. డెయిరీ అభివృద్ధి చెందితే రైతులకు మంచి ధరలతో పాటు బోనస్‌లు కూడా అందించే అవకాశం ఉంటుంది. నేను ఇక్కడ రైతులకు హామీ ఇస్తున్నాను. మనమంతా కలిసి ఒక్క సంవత్సరం పాటు మన డెయిరీని కాపాడుకుంటే రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందుతాయి. ఇటీవల డెయిరీ బోర్డు డైరెక్టర్లతో చర్చలు జరిపాం. రోజుకు వెయ్యి లీటర్లకు పైగా పాలు సరఫరా చేసే సంఘాలకు ప్రతి లీటరుకు అదనంగా ఒక రూపాయి బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. అలాగే అధిక పరిమాణంలో పాలు పోసే రైతులకు కూడా అదనపు ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ఎండాకాలంలో పాల ఉత్పత్తి తగ్గినందున ప్రైవేట్ డెయిరీలు ఎక్కువ ధరలు ఇస్తున్నట్లు కనిపించవచ్చు. కానీ వర్షాకాలంలో పాల ఉత్పత్తి పెరిగినప్పుడు అదే ప్రైవేట్ సంస్థలు ధరలు తగ్గించే అవకాశం ఉంటుంది. అందువల్ల రైతులు తాత్కాలిక లాభాల కోసం కాకుండా దీర్ఘకాల ప్రయోజనాల కోసం తమ డెయిరీలకు మద్దతు ఇవ్వాలి. నల్లగొండ జిల్లా పాల ఉత్పత్తిదారులు ముఖ్యంగా తమ డెయిరీని బలోపేతం చేయాలని కోరారు. మన డెయిరీ బలపడితే లాభాలు, బోనస్‌లు



మరియు ఇతర ప్రయోజనాలు రైతులకే వస్తాయి. ఒక్క చుక్క పాలు కూడా బయటకు వెళ్లకుండా డెయిరీకి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. మూతపడిన పాల సేకరణ కేంద్రాలను తిరిగి ప్రారంభించడం, రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, డెయిరీ సంఘాల నాయకులు అందరూ కలిసి డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మరిన్ని లాభాలు, బోనస్‌లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు.

## నిత్యం నిరుపేదలకు అండగా నిలుస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, నారాయణ ఖేడ్ :** నిజాంపేట మండలం కొత్తపల్లి గ్రామంలో మరోసారి తన సేవా కార్యక్రమాలతో మానవత్వాన్ని చాటుకుంది జీఎంఆర్ ఫౌండేషన్. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం చాకలి సంగయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ యస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు, ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను జీఎంఆర్ టీం సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. అవసరంలో ఉన్న ప్రజలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు జీఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, సమాజంలోని బలహీన వర్గాలకు ఇలాంటి సహాయ సహకారాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవయ్య, రిపోర్టర్ భూమయ్య, యువ నాయకులు సందీప్, జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు నమిల్ల హన్మండ్లు, అభి పవర్, వార్డ్ మెంబర్ లక్ష్మయ్య, దుర్గయ్య, సురేందర్, సంతు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం మున్సిపల్ 56 వ డివిజన్ లో అక్షరాభ్యాస బడిబాట కార్యక్రమం

**కార్యాక్రమంలో పాల్గొన్న 56 డివిజన్ కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు**

**పెద్దపల్లి జిల్లా, జూన్ 24, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** విద్య రంగానికి పెద్ద పీట వేస్తున్న తెలంగాణ రాష్ట్ర సీ.ఎం రేవంత్ రెడ్డికి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కి డివిజన్ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 56 వ డివిజన్ కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు. బుధవారం రోజు జరిగిన బడిబాట కార్యక్రమంలో స్థానిక 56వ డివిజన్ అంగన్వాడి కేంద్రంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యాక్రమం సందర్భంగా కార్పొరేటర్ కొమ్ము స్వప్న చేతులమీదుగా విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు పంపిణి చేసారు. ఈ కార్యాక్రమంలో పలువురు అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు అక్షర అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ విద్యార్థుల ఎదుగుదలకు పౌష్టిక అల్పాహారం మరియు మధ్యాహ్న భోజనం అందజేస్తూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మంచి విద్యను అందిస్తూ విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణుతో పాటు అంగన్వాడి టీచర్ రేణుక, ఆయాలు, అంగన్వాడి విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమానికి సహకరించిన వంటి ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.



## మోతినగర్ మాజీ కౌన్సిలర్ బీ.ఆర్.ఎస్ నేతకు ఘన నివాళి

### కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ముద్దం




మోతి నగర్, ఎర్రగడ్డ, జూన్ 24,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
కూకట్‌పల్లి నియోజకవర్గం మోతీనగర్ కి చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు సత్యనారాయణ పరమపదించిన విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్,బుధవారం నివాసానికి వెళ్లి వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ సత్యనారాయణ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని, సత్యనారాయణ సేవలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆ భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు.

## వైద్యంలో ఎన్నో మెలుకువలు... అందుబాటులో రెండు రోజులు

### ప్రెస్ మీట్ లో యశోద ఆసుపత్రి ఆర్థో సర్జన్ డాక్టర్ ఆదిత్యరెడ్డి




హైదరాబాద్ పల్స్ న్యూస్, జహీరాబాద్, జూన్ 24:
ఫ్యాక్చర్, ఫిక్సెషన్ వెరీ ఈజీ అని యశోద ఆసుపత్రి అర్థో సర్జన్ డాక్టర్ ఆదిత్య రెడ్డి అన్నారు. బుధవారం జహీరాబాద్ సిటీ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. మోకాల అరుగుదలకు మార్పిడి లేకుండా, స్పోర్ట్స్ ఇంజురిస్, బరువు వల్ల ఒకే వైపు నొప్పులు తదితర బాధల నివారణకు మంచి చికిత్సతో పాటు ఐదు నుండి పదేళ్ల వరకు ఆపరేషన్ అవసరం లేకుండా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గతంలో మోకాల అరుగుదల 50 ఏళ్ళు గడిచిన తరువాత వచ్చేదని, ఇప్పుడు 35సంవత్సరాల నుండే సమస్యలు వస్తున్నాయన్నారు. వీరికి ఫిజీయోత్ట?రఫీ, రేడియో ఫిక్షేన్సీ ద్వారా చికిత్స చేయడం మూలంగా మరో పదేళ్ల వరకు సమస్య ఉత్పన్నం కాదన్నారు. బరువు కారణంగా ఒక కాలుకే మోకాలు నొప్పి రావడం జరుగుతుందని, మరో కాలు నుండి చిన్నపాటి భాగం అమర్చి వైద్యం అందిస్తామన్నారు. జహీరాబాద్ సిటీ సెంటర్ స్పెషలిటీ ఆసుపత్రిలో ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రజలు గమనించి వైద్యన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిటీ సెంటర్ డాక్టర్ అనురుద్ రెడ్డి, యశోద మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెమీస్‌కు బౌల్డర్ హిల్స్ టైగర్స్, బంకర్ బస్టర్స్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: టీ9 చాలెంజ్ గోల్ఫ్ నాలుగో సీజన్ టోర్నమెంట్‌లో బంకర్ బస్టర్స్, చాముండి బౌల్డర్‌హిల్స్ టైగర్స్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. హైదరాబాద్ గోల్ఫర్ యునైటెడ్, దసోస్ బై మహీ జట్లు కూడా ముందంజ వేశాయి. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ గోల్ఫర్ యునైటెడ్ 3-1తో వీసాఫ్ట్ టైటాన్స్‌ను ఓడించగా.. బంకర్ బస్టర్స్ 5-2తో ఫెయిర్‌వే వారియర్స్‌పై విజయం సాధించింది. బౌల్డర్‌హిల్స్ టైగర్స్ జట్టు 4-0తో పార్ టైమర్స్‌ను క్లీన్‌స్వీప్ చేసి ముందంజ వేయగా..ఆఖరి క్వార్టర్స్ పోరులో దసోస్ బై మహీ 3-1తో ఐరన్ ఈగల్స్‌ను ఓడించి సెమీస్ బెర్తు సొంతం చేసుకుంది. సెమీస్‌లో బస్టర్స్‌తో గోల్ఫర్ యునైటెడ్, బౌల్డర్‌హిల్స్ టైగర్స్‌తో మహి జట్లు తలపడతాయి.

## వానదేవుడి కరుణ కోసం శీతల తండా రైతుల ప్రార్థనలు



హైదరాబాద్ పల్స్, జూన్ 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :
మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం అంధనాలపాడు గ్రామంలోని శీతల తండాలో వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులు, మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణంగా ఈ సమయానికి విస్తారంగా కురవాల్సిన వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే పలువురు రైతులు సాగు పనులకు సిద్ధమై ఉండగా, వర్షాల ఆలస్యంతో వ్యవసాయ పనులు ముందుకు సాగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తండాలోని శీతల భవాని అమ్మవారి ఆలయం వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ గోపురం మరియు అమ్మవారి విగ్రహంపై పవిత్ర జలాలు పోసి మొక్కులు చెల్లించారు. వర్షాధార పంటలు సాగు చేసే రైతులకు ఈ వర్షాకాలం ఎంతో కీలకమని, సకాలంలో వర్షాలు కురవకపోతే పంటల సాగు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించి మంచి వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు నిండిపోవాలని, రైతుల కష్టాలు తీరాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పంటలు సమృద్ధిగా పండితే గ్రామ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని, రైతు కుటుంబాల్లో ఆనందం నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన మహిళలు, రైతులు, యువకులు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని శీతల భవాని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, గ్రామానికి సుభిక్షం చేకూరాలని ప్రార్థనలు చేశారు. తండా పరిసరాలు భక్తుల జైజై ధ్వానాలతో మార్మోగాయి. రైతుల ఆశలు ఫలించి రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## ప్రజా చైతన్యానికి నిలువెత్తు ప్రతిరూపం కమలమ్మ : సీపీఎం నేతల నివాళి




హైదరాబాద్ పల్స్ జూన్ 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :
సమాజ సేవ, ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో జీవించిన మేకపోతుల కమలమ్మ మృతిపట్ల సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గొల్లచర్ల గ్రామంలోని ఆమె నివాసానికి చేరుకున్న నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కమలమ్మ వంటి మాతృమూర్తులు ప్రజా ఉద్యమాలకు వెన్నెముకలుగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన అనేక పోరాటాలకు ఆమె కుటుంబం అందించిన సహకారం చిరస్మరణీయమని అన్నారు. ప్రజలతో మమేకమై జీవించిన కమలమ్మ సేవలను గుర్తుచేసుకుంటూ, ఆమె ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఆమె మరణం గ్రామానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.రాములు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, రాష్ట్ర కార్యదర్శి శ్రీరాం నాయక్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న, డోర్నకల్ మండల కార్యదర్శి ఉప్పునపల్లి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వెంకన్న, గిరిజన సంఘం నాయకులు, సీపీఎం కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దిశ సమావేశంలో పాల్గొన్న ఎంపి సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, నారాయణ ఖేడ్ :
సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నాడు నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా - డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మాణిక్ రావు ఎమ్మెల్యే, పందు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి, నిరుపేదకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు నియోజకవర్గంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరా మరియు ఇతర మౌలిక సదుపాయాల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు.ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

**అధికారుల సమన్వయం**

వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిధుల సద్వినియోగం జరిగేలా చూడాలని, నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ షాక్ తో భారత్ కు వేల కోట్ల నష్టం.. ఏడాదికి రూ. 4 వేల కోట్లు పైనే..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, సెంట్రల్ డెస్క్ :**
భారత విమానాలపై పాకిస్థాన్ గగనతలం నిషేధాన్ని మరోసారి పొడిగించింది. జూలై 24 వరకు పొడిగిస్తూ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఏడాదిగా పాకిస్థాన్ గగనతలం మూసివేసిన నేపథ్యంలో భారత్ కు వేల కోట్ల నష్టం వాటిల్లుతోంది. భారత్ లోని ఎయిర్ ఇండియా తదితర విమానయాన సంస్థలకు ఏటా రూ. 4 వేల కోట్లకుపైనే నష్టం వాటిల్లుతున్నట్లు స్పష్టం అవుతోంది. విమాన ప్రయాణ సమయం కూడా 60 నిమిషాల నుంచి దాదాపు 3 గంటలకు పెరిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ నిర్ణయం.. భారత్ వైమానిక రంగంపైనే ప్రభావం చూపుతోందని సమాచారం.పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, పాకిస్థాన్ తన వైమానిక మార్గాల మూసివేతను నిరంతరం పొడిగిస్తుండటం భారతీయ విమానయాన రంగంపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. అంతర్జాతీయ మార్గాల ఎంపిక, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ దేశీయ విమానయాన దిగ్గజాలకు సవాలుగా మారింది. ముఖ్యంగా ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి అగ్రశ్రేణి సంస్థలు తమ ప్రయాణ రూట్లను మార్చుకోవడమే కాకుండా, పలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసుకోవాల్సి వస్తోంది.భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఇండిగో సంస్థ తాష్కెంట్, అల్మట్టి, హోచిమిన్ సిటీ, హాంకాంగ్, షాంఘై వంటి పలు అంతర్జాతీయ నగరాలకు విమాన సర్వీసులను పూర్తిగా నిలిపివేసింది. మరోవైపు, ఎయిర్ ఇండియా సైతం చికాగో, షాంఘై, మాలే మార్గాల్లో విమానాలను రద్దు చేసుకుంది. గతంలో నడిపిన నాన్-స్టాప్ అమెరికా విమానాలను వియన్నా, కోల్‌కతా లేదా సియోల్ మీదుగా ఒక స్టాప్ తో నడపాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ సమయంతో పాటు ల్యాండింగ్, టేకాఫ్ ల రూపంలో ఫ్లైట్ సైకిల్స్ రెట్టింపై విమానాల నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతోంది.

సర్వీసుల రద్దు, అంతర్జాతీయ రూట్ల మార్పు ప్రభావం:
దేశీయ విమాన సంస్థల అంతర్జాతీయ మార్కెట్ వాటాపై స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో భారత్ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికుల్లో దేశీయ ఎయిర్‌లైన్స్ వాటా 46.3 శాతంగా ఉండగా, ప్రస్తుత సంక్షోభం కారణంగా అది 42.3 శాతానికి పడిపోయింది. ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ విదేశీ విమానయాన సంస్థలు రవాణా మార్కెట్‌లో మళ్లీ పట్టు సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి.

భారతదేశంలో విమాన ఇంధన ధరలు (ఏటీఎఫ్):
ఎయిర్‌లైన్స్ మొత్తం నిర్వహణ ఖర్చుల్లో దాదాపు 35 నుండి 40 శాతం వరకు ఆక్రమిస్తాయి. ఇంధన ఖర్చుల భారం పెరగడంతో సర్వీసుల నిర్వహణ ఆర్థికంగా క్లిష్టంగా మారుతోంది. గత 19 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఒక్క అంతర్జాతీయ రూట్‌ను కూడా రద్దు చేయని రికార్డు ఉన్న ఇండిగో, ప్రస్తుత పరిస్థితుల వల్ల పలు సర్వీసులను నిలిపివేయాల్సి వచ్చింది. ఎయిర్ ఇండియా సైతం ప్రైవేటీకరణ తర్వాత అమెరికా సర్వీసుల పరంగా అత్యంత కఠినమైన దశను ఎదుర్కొంటోంది.ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విమానయాన సంస్థలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇంధన స్థిరీకరణ నిధిని ప్రవేశపెట్టినప్పటికీ, దాని లబ్ధిపై ఇంకా స్పష్టత లేదు. దేశీయ విమానయాన రంగంలో సుమారు 90 శాతం మార్కెట్ వాటాను నియంత్రిస్తున్న ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు ప్రస్తుతం తమ సామర్థ్యాన్ని తగ్గించుకుని ఆచితూచి ముందడుగు వేస్తున్నాయి. అంతర్జాతీయ మార్గాల్లో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొంటేనే భారత విమానయాన రంగానికి తగిన ఊరట లభిస్తుంది.

# జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిఐజీ



హైదరాబాద్ పల్స్ న్యూస్, జహీరాబాద్, జూన్ 24 :







జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయంను బుధవారం డిఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్ తనిఖీ చేసారు. స్టేషన్ల ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో నిబద్ధత, పనిపట్ల అంకితభావం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని డీఐజీ చౌహాన్ అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. డీఎస్పీ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచార, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల నేరాలను నియంత్రించడానికి ఎప్పటికప్పుడు సబ్ డివిజన్ పోలీసు అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని డీఎస్పీకి సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల చేదనకు సబ్–డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో జహీరాబాద్ పట్టణం ఒకటని, నిమ్జ్ రాకతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అదేవిధంగా ఆర్థిక నేరాలు పెరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఆర్థిక నేరాలను అధిగమించడానికి అనుమానిత ప్రాంతాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకోవాలని సూచించారు. జహీరాబాద్ పట్టణం రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా ఇతర రాష్ట్రాల నుండి అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, అక్రమ రవాణాకు వీలు లేకుండా చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాలలో, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘాను కట్టుదిట్టం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపుతామనే భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, ప్రతి ఫైల్‌ను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని, స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి బీట్ విధుల్లో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్ ద్వారా తనిఖీ చేసి పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్--2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకొని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ కోసం కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. నేరాల నివారణలో జరిగిన నేరాలను ఛేదించడంలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఆయా గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎస్బి ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, సిఐ శివలింగం, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండాల అంగడి సంతను సందర్శించి... కూరగాయలు కొనుగోలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని అంగడి సంతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి సంతలో తిరుగుతూ వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కూరగాయల మార్కెట్ ప్రాంతంలో తగినంత వెలుతురు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బీర్ల ఐలయ్య మార్కెట్‌లో అవసరమైన వీధి లైట్లు (స్ట్రీట్ లైట్లు) ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన స్వయంగా అంగడి సంతలో కూరగాయలు కొనుగోలు చేసి సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. సంతలో ఉన్న వ్యాపారులు, మహిళలు, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తర్వాత ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడిన బీర్ల ఐలయ్య, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం సక్రమంగా అందుతున్నదా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పథకం అమలుపై మహిళల అభిప్రాయాలను స్వయంగా విని, సేవల నాణ్యతపై వివరాలు సేకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. స్థానికులు కూడా ఆయన సంత సందర్శనపై హర్షం వ్యక్తం చేశారు.

## భారత పౌరులకు బిగ్ అలర్ట్..
# పాస్‌పోర్ట్ పౌరసత్వాన్ని డిసైడ్ చేయదు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, వెబ్ డెస్క్:**
భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ప్రకటన చేసింది. సాధారణంగా భారతీయులకు మాత్రమే జారీ చేసే పాస్‌పోర్ట్, దేశ పౌరసత్వాన్ని నిరూపించే తుది పత్రం కాదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. "పాస్‌పోర్ట్ సేవా దివస్" సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.


**పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణానికి మాత్రమే..**
విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. పాస్‌పోర్ట్ అనేది ప్రాథమికంగా కేవలం ఓ అంతర్జాతీయ ప్రయాణ పత్రమేనని.. విదేశీ ప్రయాణాలను సులభతరం చేసేందుకు మాత్రమే ప్రభుత్వం దీనిని జారీ చేస్తుందని తెలిపారు. ఓ వ్యక్తి విదేశాల్లో ఉన్నప్పుడు ఆయన భారతీయ జాతీయుడని ధృవీకరించడానికి ఇది ఉపయోగపడుతుంది తప్ప, అది దేశ పౌరసత్వానికి అంతిమ ఆధారం కాబోదని కేంద్రం పేర్కొంది.

**ఆధార్, ఓటర్ ఐడీ కూడా..**
ఇప్పటికే సుప్రీంకోర్టు కీలక విచారణల సందర్భంగా ఆధార్ కార్డ్ అనేది కేవలం ఒక వ్యక్తి గుర్తింపు పత్రం మాత్రమే కానీ, పౌరసత్వ నిరూపణ పత్రం కాదని స్పష్టం చేసింది. అలాగే ఓటర్ ఐడీ కార్డ్ కూడా కేవలం ఓటు వేయడానికి, నివాస ధృవీకరణకు మాత్రమే ఉపయోగపడుతుంది కానీ పౌరసత్వానికి కాదని పేర్కొంది. చట్టాల ప్రకారం.. జనన ధృవీకరణ పత్రాలు




నిర్దేశిత సంవత్సరాల కంటే ముందు తల్లిదండ్రులు ఇక్కడే నివసించినట్లుగా ఉండే కేంద్ర ప్రభుత్వ అధికారిక పత్రాలే పౌరసత్వాన్ని డిసైడ్ చేస్తాయని విదేశాంగ పేర్కొంది.

## హైదరాబాద్ లో దారుణ ఘటన... హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, తెలంగాణ బ్యూరో:
హైదరాబాద్ గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఓ హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవించడం కలకలం రేపింది. ప్రసవించిన అనంతరం వెంటిలేటర్ నుంచి బయటకు విసిరివేయడంతో పుట్టిన నవజాత శిశువు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్ర రక్తస్రావమైన యువతి ప్రస్తుతం నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నవజాత శిశువు మృతదేహాన్ని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై హాస్టల్ సిబ్బంది స్పందిస్తూ సదరు యువతి గర్భం దాల్చిన విషయం తమకు తెలియదని చెప్పారు. అయితే యువతి తన బావ కారణంగా గర్భం దాల్చి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భారత్ పై ఎల్ నినో దెబ్బ మామూలుగా లేదు.. !!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, సెంట్రల్ డెస్క్ : దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడం, సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోండటం ఆందోళనకు దారి తీస్తోంది. దీంతో రాబోయే ఖరీఫ్ సాగు కాలంలో రైతులకు ఎలాంటి నష్టాలు వాటిల్లకుండా ఉండేందుకు కేంద్రం తక్షణ చర్యలను ప్రారంభించింది. దేశంలో వ్యవసాయ రంగంపై వర్షాల తీవ్రతను అంచనా వేసింది. వర్షాభావ పరిస్థితుల ముప్పు ఎక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లో 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గుర్తించింది. వీటికోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. జూలై 2వ తేదీ నాటికీ దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉంది. ఇప్పటివరకు దేశంలో సాధారణం కంటే దాదాపు 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రత్యేకించి.. వర్షాధార ప్రాంతాల్లో ఖరీఫ్ పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎల్ నినో వల్లే ఈ దుర్భిక్ష పరిస్థితులు తలెత్తినట్టు కేంద్రం చెప్పకనే చెప్పింది.

సాగునీటి లభ్యత ఆధారంగా జిల్లాల వర్గీకరణ
కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఈ 12 తీవ్ర వర్షాభావ జిల్లాలలో ఏపీ, తెలంగాణ కూడా ఉన్నాయి. వీటితో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బిహార్, జార్ఖండ్, ఒడిశాలు దాదాపుగా కరవు ఛాయలు ఏర్పడినట్టయింది. ఈ 312 జిల్లాలను అక్కడ అందుబాటులో ఉన్న సాగునీటి సౌకర్యాల ఆధారంగా ప్రభుత్వం మూడు నిర్దుష్ట కేటగిరీలుగా వర్గీకరించింది. 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి ఉన్న 111 జిల్లాలను అత్యంత ప్రాధాన్యత విభాగంలో చేర్చింది. మిగిలిన జిల్లాలలో 25 నుండి 50 శాతం మధ్య సాగునీటి వసతి కలిగిన 76 జిల్లాలను మధ్యస్థ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలుగా వర్గీకరించారు. తలసరి సాగునీటి మౌలిక వసతులు మెరుగ్గా ఉండి, 50 శాతం కంటే ఎక్కువ నీటి వసతి ఉన్న మిగిలిన 128 జిల్లాలను తక్కువ ముప్పు ఉన్న విభాగంలో చేర్చారు. ఈ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పంటల పరిరక్షణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా స్థాయి యంత్రాంగాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి.




ప్రత్యామ్నాయ పంటలు, నీటి నిల్వలకు ప్రాధాన్యత:
వర్షాభావ పరిస్థితులను తట్టుకుని పంటలను కాపాడుకునేందుకు కేంద్ర వ్యవసాయ పరిశోధనా సంస్థ, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ సంయుక్తంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక వ్యవసాయ అత్యవసర ప్రణాళికలను రూపొందించాయి. వర్షాలు నిలిచిపోయే అవకాశం ఉన్న ప్రాంతాలలో సాగు ఖర్చులు భారం కాకుండా, తక్కువ నీటి అవసరం ఉండే, తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ పంటలను వేసేలా రైతులను ప్రోత్సహించాలని కేంద్రం కోరింది. పంటల వైవిధ్యీకరణ ద్వారా సాగు నష్టాలను చాలా వరకు తగ్గించాలని రాష్ట్రాలకు సూచించింది. రైతాంగానికి సాగునీటి కొరత రాకుండా ఉండేందుకు రాష్ట్రాలు తమ పరిధిలోని చెరువులు, కాల్వలు, జలాశయాలు, పొలాల్లోని చిన్న కుంటలు, చెక్ డ్యామ్‌ల మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వాన నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేందుకు వీలుగా తాత్కాలిక కట్టలను నిర్మించాలని సూచించింది. తీవ్ర నీటి కొరత ఉన్న సున్నితమైన జిల్లాల్లో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చింది.

## భారీ విజయమే లక్ష్యంగా..

మాంచెస్టర్: రెండు భారీ విజయాలతో టీ20 ప్రపంచకప్ వేటను ఆరంభించిన భారత మహిళల క్రికెట్ జట్టు.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే గ్రూప్-ఏలో భాగంగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది. నాలుగు రోజుల క్రితం దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన టీమ్ఇండియా.. మళ్లీ గెలుపుబాట పట్టడంతో పాటు నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థిపై భారీ తేడాతో గెలువాలనే లక్ష్యంతో ఉంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నాలుగు పాయింట్లతో ఆస్ట్రేలియా (8 పాయింట్లు) తర్వాత రెండో స్థానాన ఉన్నా సఫారీ, బంగ్లా జట్లు సైతం అన్నే పాయింట్లతో భారత్‌కు పోటీనిస్తున్నాయి. అయితే నెట్ రన్‌రేట్ విషయంలో భారత్ (o2.511).. సౌతాఫ్రికా (-0.546), బంగ్లా (-0.641) కంటే మెరుగ్గా ఉండటం సానుకూలాంశం. బంగ్లాతో పాటు లీగ్ దశలో ఆఖరున ఆసీస్‌తో ఆడే మ్యాచ్‌లోనూ గెలిస్తే మిగతా సమీకరణాలతో సంబంధం లేకుండా భారత్ సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. కానీ ఒక్కదాంట్లో ఫలితం తేడా కొట్టినా జట్టుకు కష్టాలు తప్పవు. ఈ నేపథ్యంలో బంగ్లాపై భారీ తేడాతో గెలువడం హర్మన్‌ప్రీత్ అండ్ కో.కు అత్యంత కీలకం.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య కి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గర్భగుడిలో నెలకొన్న శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సుభిక్షానికి ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణమూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలేరు పట్టణంలో బిఎల్ఎ ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బిఎల్ఎ లకు సమగ్ర అవగాహన కల్పించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ "చాత్రింకి గుంజ్" కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన అవకతవకల కారణంగా ఎంతో మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురై, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ప్రతి విద్యార్థికి న్యాయం జరగాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత ఉండాలి. పేపర్ లీకేజీలకు శాశ్వతంగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ నెల 26వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు చాత్రంలో నిర్వహించే "చాత్రింకి గుంజ్" కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హైదరాబాద్ పల్స్

## ఆర్ఎస్ఎస్ వర్సెస్ కాంగ్రెస్... మరింత ముదురుతున్న వివాదం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, సెంట్రల్ బ్యూరో:**
దేశ రాజకీయాల్లో ఆర్ఎస్ఎస్ చట్టబద్ధత మరోసారి చర్చనీయాశంగా మారింది. కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే చేసిన ఆరోపణలు ఇప్పుడు హాట్ టాపిక్? అవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ వర్సెస్ ఆర్ఎస్ఎస్ మధ్య సైద్ధాంతిక పోరాటం సాగుతున్న వేళ రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రియాంక్ ఖర్గే లేవనెత్తిన అంశం ఎలాంటి పరిణామాలకు దారి తీయబోతోంది అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చట్టబద్ధ హోదా, ఆర్థిక నిర్వహణ, సంస్థాగత నిర్మాణం, పన్ను వర్తింపు వివరాలను బహిర్గతం చేయాలంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్?కు ప్రియాంక్ ఖర్గే ఇటీవల లేఖ రాశాయి. అయితే ఈ అంశంలో ఖర్గే తాజాగా చేసిన వ్యాఖ్యలు సిట్యుయేషన్ ను పీక్స్ కు చేర్చుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**కొత్త డాక్యుమెంట్లు సృష్టించాల్సి వస్తుందేమో:**
తాను రాసిన లేఖపై మరోసారి స్పందించిన ప్రియాంక్ ఖర్గే మోహన్ భాగవత్‌కు నేను లేఖ రాసి కేవలం వారం రోజులే అయింది. వారు 100 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన దేశభక్తులు. వారికి సంబంధించిన పత్రాలు ఎక్కడో ఒకచోట ఉండే ఉంటాయని.. నాగపూర్‌లోనో, బెంగళూరులోని కేశవ కృప (ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం) లోనో లేదా



సర్సంఘ్‌చాలక్ నివాసంలోనో ఖచ్చితంగా దాచి ఉంచి ఉంటారు అని వ్యాఖ్యానించారు. 'బహుశా ఆ డాక్యుమెంట్లను ఇప్పుడు కొత్తగా సృష్టించాల్సి వస్తుందేమో.. అందుకే వారికి కొంచెం సమయం పడుతుండవచ్చు' అంటూ ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్, ఆదాయ వనరులకు సంబంధించి తాను సంధించిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకుంటే నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం విచారణకు పిలుస్తామని ఖర్గే స్పష్టం చేశారు.

**మైలేజీ ఎవరికి డ్యామేజీ ఎవరికి?:**
బీజేపీకి మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ తన 'సెక్యులర్ మరియు రాజ్యాంగ రక్షణ' లైన్‌ను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తోందా అనే టాక్ వినిపిస్తోంది. ఆర్ఎస్ఎస్ చట్ట పరిధిలోకి రాకుండా పనిచేస్తోందనే చర్చను జాతీయ స్థాయిలో లేవనెత్తడం దీని ముఖ్య ఉద్దేశం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీ గెలుపులో ఆర్ఎస్ఎస్ క్రియాశీల పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సంస్థనే కాంగ్రెస్ తమ జాతీయ స్థాయిలో అస్త్రంగా మార్చుకోనుందా అనే టాక్ వినిపిస్తోంది. అయితే ఆర్ఎస్ఎస్ విషయంలో దాడి చేస్తే అది కాంగ్రెస్ కంటే అది బీజేపీకే మేలు చేస్తుందనే వాదన తెరపైకి వస్తోంది. 100 ఏళ్ల చరిత్ర గల ఒక సాంస్కృతిక, సామాజిక సంస్థను కాంగ్రెస్ కావాలనే వేధిస్తోందని, ఇది 'హిందూ సంస్థలపై కాంగ్రెస్ చేస్తున్న దాడి' అని బీజేపీ దేశవ్యాప్తంగా ప్రచారం చేసే అవకాశం లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ (రాహుల్ గాంధీ నేతృత్వంలో) తాము హిందూ వ్యతిరేకం కాదని నిరూపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రయత్నిస్తోంది. అయితే, ఆర్ఎస్ఎస్‌పై లీగల్ యాక్షన్, డాక్యుమెంట్ల సృష్టి వంటి తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు జాతీయ స్థాయిలో 'యాంటీ-హిందూ' ముద్ర పడే ప్రమాదాన్ని పెంచుతాయనే టాక్ వినిపిస్తోంది. ఇది హిందీ హార్ట్‌ల్యాండ్ (ఉత్తర భారతదేశం) లో కాంగ్రెస్‌కు నష్టం చేయవచ్చనే చర్చ జరుగుతోంది. మరి కర్ణాటకలో మొదలైన కొత్త డిబేట్ భవిష్యత్ రాజకీయాలకు ఎలాంటి కేరాఫ్ గా మారబోతోంది అనేది కాలమే సమాధానం చెప్పనుంది.

## "ఒమేగా బ్లాక్": నిప్పుల కొలిమిలా మారిన ఐరోపా, సెగలు గక్కుతున్న ఖండం..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24 :
సెగలుగక్కుతున్న అగ్నిపర్వతంలా ప్రస్తుతం ఐరోపా ఖండం (యూరప్) మారిపోయింది. మునుపెన్నడూ లేని విధంగా అక్కడ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో ఎండలు ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ దాటడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తీవ్రమైన వేడి వాతావరణం వల్ల విద్యుత్ వ్యవస్థలపై ఊహించని ఒత్తిడి పడుతుండటంతో పాటు అనేక దేశాలలో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. లండన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హ్యూ మోంట్‌గోమరి స్పందిస్తూ.. "ఇది కేవలం వాతావరణంలో వచ్చిన తాత్కాలిక మార్పు మాత్రమే కాదు, రాబోయే మహా ప్రళయానికి ఇవి ప్రారంభ సంకేతాలు" అని సంచలన హెచ్చరికలు జారీ చేశారు. ఇంకా జూలై మాసం రాకముందే యూరప్ లో ఈ రకమైన ఎండలు రావడం భవిష్యత్తు ప్రమాదాలను ముందే సూచిస్తోంది.

**ఆకాశంలో ఏర్పడిన భారీ 'ఒమేగా బ్లాక్'.. ఏమిటిది?**
ఈ విపరీతమైన ఎండలకు ప్రధాన కారణం అంతరిక్ష వాతావరణంలో ఏర్పడిన 'ఒమేగా బ్లాక్' అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రీకు అక్షరం ఒమేగా ఆకారంలో ఉండే ఈ వాతావరణ పద్ధతి వల్ల భారీ అధిక పీడన వ్యవస్థ రెండు అల్పపీడన ప్రాంతాల మధ్య చిక్కుకుపోతుంది. దీనివల్ల సాధారణంగా పశ్చిమం నుండి తూర్పుకు ప్రయాణించే గాలులు నిలిచిపోయి, ఒకే చోట వేడి గాలి స్థిరపడిపోతుంది. ఈ దృగ్విషయాన్ని శాస్త్రవేత్తలు 'హీట్ డోమ్' అని పిలుస్తారు. దీని కారణంగా ఆకాశంలో మేఘాలు ఏర్పడవు, దాంతో సూర్యరశ్మి నేరుగా భూమిని వేడెక్కిస్తుంది. చల్లటి గాలి లోపలికి ప్రవేశించే మార్గం లేకపోవడంతో ఆ వేడి గాలి ఒక గిన్నెపై మూత




పెట్టినట్లు అక్కడే బందీ అయిపోతుంది. సాధారణంగా వేసవిలో ఇలాంటి హీట్ డోమ్స్ ఏర్పడటం సహజమే అయినప్పటికీ, ప్రస్తుత ఉష్ణోగ్రతల తీవ్రత మాత్రం శాస్త్రవేత్తలను సైతం వణికిస్తోంది.

**ప్రాణాంతకంగా మారిన ఎండలు.. నదుల్లో శవాలు!**
ఈ భీకరమైన వేడికి తట్టుకోలేక చాలా మంది ఉపశమనం కోసం నీటి వనరుల వైపు పరుగులు తీస్తున్నారు. ఫ్రాన్స్ లో జూన్ 18 నుంచి ఇప్పటివరకు సుమారు 40 మంది ఈత కొడుతూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. అలాగే దక్షిణ ఫ్రాన్స్ లో ఎండ వేడికి కారులోనే ఇద్దరు చిన్నారులు ఊపిరాడక చనిపోగా, బెల్జియంలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. పరిస్థితి తీవ్రతను బట్టి వైద్య నిపుణులు ఇప్పటికే అక్కడ రెడ్ అలర్ట్ జారీ చేశారు.ప్రస్తుత సంక్షోభంలో ఒక్క ఫ్రాన్స్ మాత్రమే కాకుండా స్పెయిన్, ఇటలీ దేశాలు కూడా అల్లాడిపోతున్నాయి. స్పెయిన్‌లోని ఆండూజార్ నగరంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటాయి. దీంతో ఆ దేశ వాతావరణ విభాగం కొర్డోబా, బిల్బావో వంటి నగరాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇటలీ ప్రభుత్వం కూడా రోమ్, మిలన్ సహా 16 ప్రధాన నగరాలను అత్యంత ప్రమాదకరమైన జోన్లుగా ప్రకటించింది.

**చల్లని దేశాల్లోనూ వేళల మార్పు.. వందేళ్ల రికార్డులు బూడిద!**
సంప్రదాయబద్ధంగా ఎప్పుడూ చల్లటి వాతావరణం ఉండే యూకే (యూనైటెడ్ కింగ్‌డమ్) లాంటి దేశాల్లో కూడా పాఠశాలల వేళలను మార్చవలసి వచ్చింది. ఎందుకంటే అక్కడి భవనాలు ఇలాంటి తీవ్రమైన వేడిని తట్టుకునేలా నిర్మించబడలేదు. అటు పోలాండ్‌లో కూడా వందేళ్ల కిందటి గరిష్ట రికార్డు ఉష్ణోగ్రత అయిన 40.2 డిగ్రీల సెల్సియస్ దాటిపోయే అవకాశాలు ఉన్నాయని అక్కడి వాతావరణ పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.యూరప్‌లో ప్రధాన కేంద్రంగా ఉన్న ఫ్రాన్స్‌లో మునుపెన్నడూ లేని విధంగా 1947 తర్వాత దేశవ్యాప్తంగా అత్యధిక సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన ఎండల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు నిలిచిపోయి వేలాది ఇళ్లకు కరెంటు సరఫరా ఆగిపోయింది. దేశంలో దాదాపు 1800 పాఠశాలలను మూసివేయగా, లూవ్ర్ మ్యూజియం వంటి చారిత్రక సందర్శనా స్థలాల పనివేళలు కూడా భారీగా కుదించారు.

**ప్రపంచం కంటే వేగంగా వేడెక్కుతున్న యూరప్.. కారణం ఏంటి?**
భూగోళం మీద ఉన్న మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే యూరప్ ఖండం రెండు నుంచి మూడు రెట్లు వేగంగా వేడెక్కుతోంది. ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతానికి దగ్గరగా ఉండటం దీనికి ఒక ప్రధాన కారణం. అక్కడ మంచు కరగడం వల్ల సూర్యకిరణాలను శోషించుకునే నల్లటి భూభాగం పెరిగిపోతోంది. ఫలితంగా ఉష్ణోగ్రతలు మరింత వేగంగా పెరుగుతున్నాయి. కాలుష్య నియంత్రణ చర్యల వల్ల వాతావరణంలో దుమ్ము కణాలు తగ్గడం కూడా మరో కారణం అని తెలుస్తోంది.

## ధర్మేంద్ర ప్రధాన్ ఔట్, రాఘవ్ చద్దా..నితీశ్ ఇన్ - భారీ ప్రక్షాళన, ముహూర్తం ఫిక్స్..!!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, న్యూఢిల్లీ బ్యూరో : ప్రధాని మోదీ 4.0 టార్గెట్ గా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం.. పార్టీలో కీలక మార్పులకు సిద్ధం అయ్యారు. కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో పాటుగా.. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 12 మంది మంత్రుల తొలిగింపు దాదాపు ఖరారైంది. ఇద్దరు సీనియర్లకు గవర్నర్ పదవులు ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసిన ప్రధాని.. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన పైన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కసరత్తు వేగవంతం అయింది. మంగళవారం సాయంత్రం ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని కీలక సమాలోచనలు జరిపారు. మరోవైపు ఇద్దరు కేంద్రమంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినా.. వారిని తిరిగి ఎంపిక చేయలేదు. వీరిలో ఒకరు బుధవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఈ నెల 26 లేదా 27న ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ రోజు (బుధవారం) జరిగే కేంద్ర క్యాబినెట్ భేటీలో



పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా, కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈ నెల 21నే ముగియగా.. ఆమెను కూడా రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు.

ఈ వారంలోనే ప్రక్షాళనకు అవకాశం..!

ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది. నీట్ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను సైతం తప్పించనున్నారు. ఆప్ నుంచి బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా తో పాటుగా బీహార్ మాజీ సీఎం నితీశ్ కేబినెట్ లో చేరనున్నారు. పంజాబ్ లో ఉన్న బీజేపీ చీఫ్ నితీన్ నబీన్ హుటా హుటిన ఢిల్లీ చేరుకున్నారు. మిత్రపక్షాలకు ఈ సారి ప్రాధాన్యత పెరిగేలా మార్పులు ఉంటాయని చెబుతున్నారు. దీంతో.. ఈ రోజు కేంద్ర కేబినెట్ తరువాత కేబినెట్ ప్రక్షాళన పైన పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 8 ఏళ్ల తర్వాత కనిపించిన ఆడపులి! 'రాజకుమారి' ఎంట్రీ..

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24 :
అడవిలో ఒక అద్భుతం జరిగింది. గత ఎనిమిదేళ్లుగా ఒక్క ఆడపులి జాడ కూడా లేక వెలవెలబోయిన ఒక ప్రముఖ టైగర్ రిజర్వ్‌లోకి.. అకస్మాత్తుగా ఒక మహారాణి అడుగుపెట్టింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న 'ఆల్ ఇండియా టైగర్ సెన్సస్ 2026' (పులుల గణన) లో ఈ విషయం వెలుగుచూసింది. అక్కడ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన ఈ ఆడపులి దృశ్యాలు వన్యప్రాణి ప్రేమికుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని చారిత్రాత్మక ఉదంతి-సితానది టైగర్ రిజర్వ్‌లో గత ఎనిమిదేళ్లుగా ఆడపులి ఉనికి లేకుండా పోయింది. అయితే జాతీయ పులుల గణనలో భాగంగా అడవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాప్ కెమెరాల్లో ఇటీవల ఒక ఆడపులి ఫోటోలు, వీడియోలు నిరంతరాయంగా రికార్డవుతున్నాయి. ఈ చిత్రాలను వెరిఫికేషన్ కోసం 'నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ' కి పంపగా, గతంలో ఈ పులికి సంబంధించిన ఎలాంటి రికార్డులూ లేవని తేలింది. అంటే, దేశంలోని పులుల లెక్కల్లోకి ఇది సరికొత్తగా చేరిన సరికొత్త రికార్డు అన్నమాట.

ఒంటరిగా వెళ్ళిపోయిన మగపులి.. ఇప్పుడు ఆమె కోసం?



ఈ పరిణామంపై ఉదంతి-సితానది టైగర్ రిజర్వ్ డిప్యూటీ డైరెక్టర్ వరుణ్ జైన్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "గత ఏడాది అంటే.. 2025 ఏప్రిల్‌లో ఇక్కడికి ఒక మగపులి వచ్చింది. దాదాపు 6 నుంచి 8 నెలల పాటు ఇక్కడి అడవుల్లో తిరిగింది. కానీ ఆ సమయంలో ఇక్కడ దానికి జోడీగా ఆడపులి లేకపోవడంతో అది ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయింది. కానీ ఇప్పుడు ఈ ఆడపులి ఇక్కడే తన సొంత సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుంటున్నట్లు కనిపిస్తోంది" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పులుల సంరక్షణ కోసం మహారాష్ట్ర నుంచి ఒడిశా వరకు యాంటీ పోచింగ్ (వేట నిరోధక) ఆపరేషన్స్ రన్ చేస్తున్నామని, అడవిలో సోలార్ పంపులు, జంతువుల కోసం నీటి వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎకో టూరిజం.. సరికొత్త ఆకర్షణలు:

ప్రస్తుతానికి ఈ రిజర్వ్‌లో ఒకట్రెండు పులులు మాత్రమే అందుబాటులో ఉన్నందున, పర్యాటకుల కోసం జిప్సీ సఫారీలను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ పులులతో పాటు అరుదైన ఎగిరే ఉడుతలు, రంగుల ఉడుతలు, హిమాలయాలు, పశ్చిమ కనుమలలో మాత్రమే కనిపించే 'మలబార్-బిల్డ్ హార్న్‌బిల్' పక్షులు కూడా ఇక్కడ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. వీటిని బేస్ చేసుకుని బర్డ్ వాచింగ్, ట్రెకింగ్ ప్రోగ్రామ్‌లు, హోమ్‌స్టేలను నిర్వహిస్తూ స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఎన్టీసీఏ నివేదికల ప్రకారం :

దేశంలో పులుల సంరక్షణ చర్యల వల్ల భారతదేశంలో పులుల జనాభా 2018లో 2967 ఉండగా, అది 2022 నాటికి 3682కి పెరిగింది. ప్రస్తుతం దేశ భౌగోళిక వైశాల్యంలో దాదాపు 2.5% విస్తీర్ణంలో 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో ఉదంతి అడవుల్లో ఆడపులి రాక... ఈ ప్రాంతంలో పులుల వంశాభివృద్ధికి, అడవుల పునరుజ్జీవనానికి ఒక శుభసూచికంగా అధికారులు భావిస్తున్నారు.

# మదర్ డెయిరి పాడి రైతులకు శుభవార్త.....

**15 రోజులకు ఒకమారు, వెంట వెంటనే పాడిరైతులకు పాల బిల్లులు చెల్లించబడును.....**

**త్వరలో భువనగిరిలో పశువులదాణా కర్మాగారము ప్రారంభించి, పశువులవదాణా సరఫరా...**

**మదర్ డెయిరి సంస్థను కాపాడుకుంటే పాడి రైతులకు మరేన్నో లాభాలు....**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి మదర్ డెయిరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ యొక్క పాడి రైతులకు శుభవార్త చెప్పారు. పాడి రైతులను ఆదుకునే విషయములో యూనియన్ ఛైర్మన్ ఓ పాలకవర్గం వారు ఎం.డి.ఎఫ్.వి.ఎల్ వారితో చర్చలు జరిపి పాలసేకరణ ధరను గత రెండు నెలల నుండి రెండుసార్లు పెంచడము జరిగినది. ప్రస్తుతము 371 సొసైటీలు ఓ 217 పాల సేకరణ కేంద్రాల ద్వారా పాలు సేకరించడము జరుగుచున్నది.

1) తేది 22.05.2026 నుండి

గేదె పాలు (కిలో వెన్నకు) : రూ. 806/- నుండి రూ. 836/- లకు

ఆవు పాలు (కిలో ఘనపదార్థములకు) : రూ. 303/- నుండి రూ. 313/- లకు



2) తేది 23.06.2026 నుండి

గేదె పాలు (కిలో వెన్నకు) : రూ. 836/- నుండి రూ. 856/- లకు

ఆవు పాలు (కిలో ఘనపదార్థములకు) : రూ. 313/- నుండి రూ. 320/- లకు రెండు నెలలో పెరిగిన ధరల ప్రకారం గేదె పాలు 6.0% ప్యాటకు రూ. 3=00 మరియు 10.0% ప్యాటకు రూ. 5=00 పెరిగినది. అలాగే ఆవు పాలు 3.0% ప్యాటకు సుమారు రూ. 2=00 మరియు 4.5% ప్యాటకు రూ. 2=21 పెరిగినది.

ఇట్టి ఒప్పందమునకు ముందు సేకరణ ధర

గేదె పాలు (కిలో వెన్నకు) : రూ. 806/-

ఆవు పాలు (కిలో ఘనపదార్థములకు) : రూ. 303/-

సకాలంలో పాల బిల్లులు చెల్లించలేక సుమారు 6 మాసాల పాల బిల్లులు పెండింగ్‌లో ఉండినవి. తేది 23.05.2026 నుండి యూనియన్, హయత్‌నగర్‌లోని ప్లాంట్ నిర్వహణ, పాలు మరియు పాల పదార్థముల మార్కెటింగ్‌ను ఎం.డి.ఎఫ్.వి.ఎల్ వారికి అప్పజెప్పడము జరిగినది. అందులో భాగంగానే మన పాడిరైతులకు సంబంధించిన పెండింగ్ పాల బిల్లులకు సంబంధించి తేది 13.05.2026 నాడు రూ. 10.00 కోట్లు విడుదల చేసి 3 మాసాల పెండింగ్ పాల బిల్లులు చెల్లించడము జరిగినది. మిగతా పెండింగ్ పాల బిల్లులు వీలైనంత తొందరగా చెల్లించుటకు చర్యలు గైకొనబడుచున్నవి. ఇప్పటి నుండి ప్రతి పక్షము (15) రోజులకు ఒకమారు, పక్షము పూర్తి అయిన 2, 3 రోజుల లోపు క్రమము తప్పకుండా వెంట వెంటనే పాడిరైతులకు పాల బిల్లులు చెల్లించబడును. అంతేకాకుండా త్వరలో భువనగిరిలో పశువులదాణా కర్మాగారము ప్రారంభించి, పశువులవదాణా సరఫరా చేయబడును. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు కూడా నాణ్యమైన పాలు ఉత్పత్తి చేసి ప్రైవేట్ డెయిరీల ప్రలోభాలకు లోంగకుండ మన సంస్థ అయిన మదర్ డెయిరిని కాపాడుకుంటు మన సంస్థను మనం రక్షించుకుందామని మీ అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**గమనిక:-** తేది 01.07.2026 నుండి రోజు ఒక్కంటికి 1,000 లీటర్ల కంటే ఎక్కువ పాలు సరఫరా చేసే సంఘాలకు లీటరుకు రూ. 1=00 చొప్పున ఓ వ్యక్తిగతంగా రైతులు ఎవరైనా రోజు ఒక్కంటికి 100 లీటర్ల పైన పాలు పోస్తే లీటరు ఒక్కంటికి రూ. 1=00 చొప్పున ఇన్‌సెంటీవ్ రూపంగా చెల్లించబడును అని తెలిపారు.

# యాదగిరిగుట్ట పట్టణంలో "సర్" పై బిఎల్ఏ లకు ప్రత్యేక అవగాహన.....

**ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి.....**

**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి.....**

**శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ ల) కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బిఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బిఎల్ఏ లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, బిఎల్ఏ లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ "చాత్రింకి గుంజ్" కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన అవకతవకల కారణంగా ఎంతో మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురై, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ప్రతి విద్యార్థికి న్యాయం జరగాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత ఉండాలి. పేపర్ లీకేజీలకు శాశ్వతంగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ నెల 26వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు చాత్రంలో నిర్వహించే "చాత్రింకి గుంజ్" ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏ లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నాయకులు నివృత్తి చేసి, కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.



## ఇంగ్లండ్‌ను నిలువరించిన ఘనా



ఫాక్స్‌బరో: వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో విజయంతో నాకౌట్ చేరుకోవాలని ఆశించిన ఇంగ్లండ్‌ను ఘనా ఇబ్బంది పెట్టింది. గ్రూప్-ఎల్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ గోల్ లేకుండా 0-0తో డ్రా అయింది. వర్షం అంతరాయం మధ్య సాగిన ఈ పోరులో ఇంగ్లిష్ టీమ్ బంతిని పూర్తిగా తమ నియంత్రణలోనే ఉంచుకున్నా.. టార్గెట్‌పై నాలుగు సహా మొత్తంగా 19 షాట్లు కొట్టినా ఘనా బలమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. చివరి నిమిషాల్లో అనేక అవకాశాలు లభించినా వాటిని గోల్‌గా మలచడంలో ఇంగ్లండ్ విఫలమైంది. 86 నిమిషంలో ఇంగ్లండ్ ప్లేయర్ నికో రీలీ నెట్ దగ్గరి నుంచి కొట్టిన హెడ్డర్ షాట్ క్రాస్ బార్‌కు తగిలింది. రీబౌండ్ అయిన బాల్‌ను అందుకున్న కెప్టెన్ హ్యారీ కేన్ ఎడమ కాలుతో కొట్టిన షాట్ కూడా మిస్సయింది. మరోవైపు తొలి నిమిషం నుంచే ఇంగ్లండ్ ఫార్వర్డ్స్‌ను బ్లాక్ చేసి ప్రత్యర్థిని విసిగించాలన్న తమ కోచ్ ప్లాన్‌ను ఘనా పక్కాగా అమలు చేసి ఓ పాయింట్ దక్కించుకుంది.

## కొలంబియా ముందుకు



గ్వాడలహారా (మెక్సికో): దక్షిణ అమెరికా ఫుట్‌బాల్‌లో మేటి జట్లలో ఒకటైన కొలంబియా ఫిఫా వరల్డ్‌కప్‌లో నాకౌట్‌కు చేరుకుంది. కాంగో బలమైన డిఫెన్స్‌ను ఛేదించి ముందంజ వేసింది. గ్రూప్-కెలో భాగంగా బుధవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కొలంబియా 1-0తో కాంగోపై విజయం సాధించింది. 76వ నిమిషంలో డానియోల్ మునోజ్ ఏకైక గోల్‌తో తన జట్టును గెలిపించాడు. దాంతో మొత్తం 5 పాయింట్లతో గ్రూప్-కెలో అగ్రస్థానంలో నిలిచిన కొలంబియా రౌండ్-32 బెర్తు ఖాయం చేసుకుంది. పోర్చుగల్ నాలుగో పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. తమ తొలి మ్యాచ్‌లో క్రిస్టియానో రొనాల్డో నేతృత్వంలోని పోర్చుగల్‌ను 1-1తో నిలువరించి 52 ఏండ్ల తర్వాత వరల్డ్‌కప్‌లో ఓ పాయింట్ దక్కించుకున్న 47వ ర్యాంకర్ కాంబో.. ఈ పోరులోనూ అద్భుతమైన డిఫెన్స్‌తో 11వ ర్యాంకర్ కొలంబియాను ఇబ్బంది పెట్టింది. ముఖ్యంగా ఆ టీమ్ గోల్ కీపర్ ఎంపసి.. కొలంబియాకు అడ్డు గోడలా నిలిచాడు. తొలి 20 నిమిషాల్లోనే ఐదు కష్టమైన సేవ్స్‌తో ఆకట్టుకున్నాడు. రోడ్రిగేజ్, జొహాన్ మంజికా, గుస్తవో పుయెర్టా కొట్టిన లాంగ్ రేంజ్ షాట్లతో పాటు.. కొలంబియా స్టార్ ఫార్వర్డ్ లూయిస్ దియాజ్, మునోజ్ క్లోజ్ షాట్లను కూడా అడ్డుకున్నాడు.

## క్రొయేషియా గెలుపు.. పనామా ఔట్

టొరాంటో: తమ దేశ దిగ్గజ ఆటగాడు లూకా మోడ్రిచ్ 200వ అంతర్జాతీయ మ్యాచ్‌లో క్రొయేషియా సత్తా చాటింది. గ్రూప్-ఎల్‌లో భాగంగా జరిగిన పోరులో 1-0తో పనామాను ఓడించి నాకౌట్ అవకాశాలు సజీవంగా నిలుపుకుంది. రెండో అర్ధభాగం 54వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ అంటి బుదిమిర్ ఏకైక గోల్‌తో ఆజట్టు గట్టెక్కింది. ఈ పరాజయంతో పనామా నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.